

# నాకు నువ్వూ నీకు నేనేనా?

—ఎర్రా

ప్రియమైన నీకు,

శ్రీ... అలవాటుగా ప్రియమైన అని సంబోధించానే గానీ నిజానికి ఎవరు ఎవరికి ప్రియం? నిన్నటివరకూ మనం ఒకరికొకరం ప్రియం. మనకి మన పిల్లలిద్దరూ ప్రియం. పిల్లలకి మనిద్దరం ప్రియం. కానీ నేడు ఎవరికి ఎవరు ప్రియం? చెప్పు శ్రీ! ఈ ప్రశ్న వేయవలసిన అవసరం ఎందుకొచ్చిందో నీకు తెలుసు.

తప్పు చేశాను. ఒప్పుకుంటున్నాను. నన్ను క్షమించు పవిత్రా అని కాళ్ళు పట్టుకున్నావు. కన్నీళ్లు పెట్టుకున్నావు. కానీ నేనే సమాధానం చెప్పలేకపోయాను. నా నోరెందుకో మూగబోయింది, మనస్సు మొద్దుబారింది. ఇక్కడితో జీవితం ముగియకపోయినా పరుగుపందెం మధ్యలో ఆగిపోయిందేమిటా అని ఆలోచిస్తుంటే పందెం మొదలు పెట్టినరోజులు గుర్తుకొస్తున్నాయి శ్రీ. అనాధగా ఈ ప్రపంచంలోకి అడుగిడిన నాకు నీతో పరిచయం, ఎండిన బీటలాంటి నా జీవితానికి తొలకరి జల్లులా అనిపించింది. పెళ్లితో అది చిరుజల్లుగా మారి ఇప్పటి వరకూ పూలవానలా కురిసింది. నా మనసనే పూలవనంలో వసంతంలా వెల్లి విరిసింది. కానీ అది జడివానగా మారి నా మనస్సుని పెను తుపానులో ముంచేస్తుందని తెలుసుకోలేకపోయాను. ఇప్పటికీ అది కలైతే బావుండుననిపిస్తోంది.

నాతో జీవితాన్ని పంచుకుంటూనే మరొక అమ్మాయితో తనువునీ పంచుకున్నావు. అది నాకు తెలియగానే ఎంత ఈజీగా (ఐస్‌క్రీంని చప్పరించినంత తేలిగ్గా) సారీ అని చెప్పేశావు. ఈ విషయాన్ని డైజెస్ట్ చేసుకోవడం నాకు చాలా కష్టంగా ఉంది. నువ్వు సారీ చెప్పినంత ఈజీగా నిన్ను క్షమించగలనా?

ఆరునెలలక్రితం నా ఫ్రెండ్ నిన్ను మరొక అమ్మాయితో హోటల్ రూంలో చూసానంది. నిజంగా నేను నమ్మలేకపోయాను. ఎందుకంటే నిన్ను నమ్మకపోతే నన్ను నేను నమ్మనట్టే అనుకునేదాన్ని. కానీ కొద్దిరోజులకే నీ నిజ స్వరూపాన్ని నేను ట్రేస్ చేయగలిగాను. నిజం నిప్పు లాంటిది శ్రీ. అది ఎప్పటికీ దాగదు.

అయినా తొందరపడి నేను వేలెత్తి చూపలేదు నిన్ను. ఎందుకంటే ఒక వేలు నీవైపుంటే మిగిలిన నాలుగూ నావైపు ఉన్నాయి అనిపించి నన్ను నేను శోధించుకున్నాను. ప్రశ్నించుకున్నాను. (పుట్టుకతో పాటు వచ్చే సంస్కారం, వయసుతోపాటు వచ్చే వ్యక్తిత్వం నన్ను తొందరపడకుండా ఆపాయి) కానీ నాలో నాకు ఎంచదగ్గ అవలక్షణం కానీ, నిన్ను నా నుండి దూరం చేసేటంత చెడ్డతనంగానీ కనిపించలేదు.

మగవాడు తప్పు చేయడానికి భార్యలో లోపమే ఉండనవసరంలేదని, మరొక ఆడదాని దరికి చేరడానికి ఆమె కూడా ఈ మగవాడ్ని లోబర్చుకోవలసిన అవసరం లేదని, వెరైటీ కోరుకునే మగవాడికి అది వెన్నతో పెట్టిన విద్య అని నిన్ను చూసాక (గమనించాక) అర్థం చేసుకున్నాను శ్రీ.

చాలామంది మగవాళ్ళలా నువ్వూ చిరుతిండికి అలవాటు పడ్డావని, ఇది మగవాళ్ళ నైజం అని సరిపెట్టుకున్నాను. మనస్సుకి ముళ్ళు గుచ్చుకుని రక్తం ఓడుతున్నా నవ్వుతూ దిగమ్రింగుకున్నాను. నా ఆత్మాభిమానాన్ని కూడా చంపుకోబోయాను. ఎందుకో తెలుసా శ్రీ... ఈ ప్రపంచంలో ఎవ్వరూలేని ఒంటరిదానిగా ఉన్నప్పుడు నీకు నేనున్నానంటూ అండగా నిలిచావు. నేనూ నిన్ను మనస్ఫూర్తిగా నమ్మాను. ఆ నమ్మకాన్ని నువ్వూ ఇప్పటివరకూ నిలబెట్టావు కూడా.

చేసిన తప్పే నువ్వు మళ్ళీ చేయడం, అది నా కంటబడడం, నువ్వూ నన్ను గమనించడం జరిగింది నిన్న.

ఎందుకు అంతగా కదిలిపోయావు శ్రీ? నన్ను క్షమించమని అడిగావు. నేనే నువ్వు, నువ్వే నేను కదా. నన్ను నేను క్షమించడమేమిటి? అందుకేనేమో నా నోట మాట రాలేదు.

నిన్న నీలో పశ్చాత్తాపం, తప్పు చేశానన్న భావం పోటీపడుతూ కనిపించాయి. నీ కళ్ళు నీటి చలమలయ్యాయి. (నన్ను కరిగించాలనా? లేక నేను కరుణించాలనా?) కానీ నాకర్థం కానిదొక్కటే శ్రీ. నీలో ఈ ఫీలింగ్స్ అన్నీ నువ్వు తప్పు చేసిన మొదటిసారే ఎందుకు కలుగలేదు.

ఆ రోజే నువ్వు సారీ అని చెప్పుంటే తప్పు ఒప్పుకుని ఉండుంటే మగవాడు ఒక బలహీన క్షణంలో చేసిన పొరపాటుగా అనుకుని (మనస్సుకి నచ్చచెప్పుకుని) ఒక భార్యగా, నా ఆడ మనస్సు నిన్ను తేలిగ్గా క్షమించి ఉండేది. కానీ నీ నైజం (నిజం) నాకు తెలిసిపోయిందన్న క్షణాన మాత్రమే నీకు పశ్చాత్తాపం కలిగింది. గత ఆరునెలలుగా నిన్ను గమనిస్తూనే వున్నాను. ఒక్కరోజున కూడా నీలో తప్పు చేస్తున్నానన్న గిల్టీ ఫీలింగ్ నాక్కనబడలేదు. కానీ నిజం నాకు తెలిసిపోయేసరికి నా కాళ్ళు పట్టుకునే లెవెల్‌కి దిగజారిపోయావు. ఒక్కసారి చేస్తే అది పొరపాటు అవుతుంది. కానీ పొరపాట్లు రిపీటయ్యాయంటే అవి ఘోరమైన తప్పులుగా మారతాయి. అయినా నేను మగవాడ్ని, ఏం చేసినా చెల్లుతుంది అనే అహంకారాన్ని ప్రదర్శించకుండా నా కాళ్ళు పట్టుకున్నావు. అంటే నన్ను దూరం చేసుకోవాలనే తలంపు నీలో లేదని నాకర్థమైంది. కానీ ఒక ఒరలో రెండు కత్తులిమడలేవు శ్రీ.

నిన్ను క్షమించానని చెప్పి నీతో కాపురం చేయలేను. అందుకు భార్యగా నా మనస్సు అంగీకరించడంలేదు. అలాగని నిన్ను వదిలి వెళ్లడానికి నా తల్లి మనసొప్పుకోవడంలేదు. తండ్రిగా నీవెన్నడూ వాళ్లకే లోటూ చేయలేదు.

నిజం చెప్పాలంటే ఒక భర్తగా అధికారాన్ని, మగవాడిగా అహంకారాన్ని కూడా నాపట్ల ఎన్నడూ చూపించలేదు. ఎన్నో ప్లస్ పాయింట్లున్న నిన్ను వదిలి వెళ్లడానికి నా మనస్సాక్షి ఎదురు తిరుగుతోంది.

అనాధగా జీవితాన్ని ఆరంభించిన నేను నిన్ను వదిలి తిరిగి అనాధగా మారి ధైర్యంగా జీవితాన్ని ఎదుర్కోగలను. కానీ అందుకు మన పిల్లల్ని బలిపశువుల్ని చేయలేను. నీ భార్యగా కాకపోయినా మన పిల్లలకి తల్లిగా నేనిక్కడుండడానికే నిర్ణయించుకున్నాను.

కానీ శ్రీ! ఆత్మాభిమానంగల ఆడదానిగా చెప్తున్నాను. నా ఒంటిమీద నీ చిటికెనవేలి స్పర్శ కూడా పడకూడదు. ఇక నుండి అలిసి ఇంటికి వచ్చిన భర్తని సేద దీర్చడానికి ఈ భార్య ఒడి సిద్ధంగా ఉండదు. నీ దారికి, నీ చిరుతిళ్ళకు నేనెన్నడూ అడ్డుగా నిలువను. దయచేసి నన్ను తాకే ప్రయత్నమెప్పుడూ చేయకు. పవిత్రత అన్నది నా పేరుకే కాదు, నా శరీరానికి కూడా మిగలనీయి. ప్లీజ్ చివరిగా ఒక మాట.

నాకు నువ్వున్నావ్, కానీ నేనే నీకు లేను. ఇప్పుడు చెప్పు శ్రీ... ఎవరు ఎవరికి ప్రియం?

నీది కాని
పవిత్ర

★